# బరువు

మినీ కథ

-ముద్దు విజయలక్ష్మి




ఒక చేతిలో పుస్తకాల సంచీ, మరో చేతిలో చిన్న కేరియర్, భుజాన వాటర్ బేగ్‌తో పదేళ్ళ ఆ పాప గబ గబా స్కూలు వేపు అడుగులు వేస్తోంది.

టైమ్ అయిపోతోందేమో అని ఒక వక్క గాభరా, వేళకి స్కూలుకి చేరగలనో లేదో అని భయం మరో వక్క.

కాళ్ళకి చెప్పులు లేవు. పాదాల నిండా దుమ్ము పేరుకుపోయి ఉంది. బట్టలకి అక్క డక్కడా చిరుగులు కనిపించకుండా వేసిన కుట్లు. వారం రోజుల్నించి అవే బట్టలు వేసుకోవడం చేత మాసి ఉన్నాయి. పాపం ఆ పాప అన్ని అవసరాలూ తీర్చ గల కుటుంబంలో పుట్టిన పిల్ల కాదు. పేదింటి పిల్ల మరి! తండ్రి సంపాదన కుటుంబానికి తిండి పెట్టడానికే చాలదు. ఇక పిల్లల కనీసావసరా లేం తీర్చగలరు?

రోడ్డుకి ఒక పక్కగా ఆగి, తన చేతుల్లోని బరువుని అటు దిటు మార్చుకుం దా పాప. పాపం ఎన్ని పుస్తకాలో! మోయలే నంత బరువుని మోస్తూ అడుగులు వేస్తోంది. రోజూ స్కూలుకి మైలు దూరం నడచి వెళ్ళి రావాలి.

నిమిషాని కోసారి రోడ్డు మీద ఎదుట పడిన వారిని ఆపి టైమ్ అడుగుతోంది. స్కూలుకి చేరే సరికి బెల్ అయిపోతుందేమో అని భయం. బెల్ అవకూడదని మనసులోనే దేముడికి మొక్కుకుంటోంది. అడుగుల వేగం పెంచింది.

మొదట్లో ఇలా బడికి వెళ్ళి రావడం ఎంతో సరదాగా ఉండేది. ఏదో తెలియని వింత ఆనందాన్ని అనుభవించేది. కాని - రాను రాను రోజూ వెళ్ళి రావడం భారంగా తయారవుతోంది ఆ పాపకి. వెళ్ళకపోతే అమ్మా, నాన్నా ఊరుకోరు. "ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటావా?" అని తిడతారు.

స్కూలు దగ్గర పడుతోంది. ఈ మలుపు తిరిగితే కొంత దూరంలో స్కూలు కనిపిస్తుంది. మలుపు తిరిగేసరికి ఆ పాపకి గుండె దడ దడ లాడింది. గేటు దగ్గర పిల్లల సందడి అప్పుడే బెల్ అయినట్టు తెలుస్తోంది.

పరుగు లాంటి నడకతో స్కూలు చేరుకుంది. గేటు దాటి ఆవరణలో అడుగుపెట్టింది.

దగ్గర దగ్గర ఇళ్ళకి వెళ్ళడానికి గేటు దాటుతున్న పిల్లలు కొంతమంది చేతుల్లో చిన్న చిన్న కేరియర్ల టిఫిన్ బాక్సుల్తో గుంపులుగా విడిపోతున్న పిల్లలు - వాళ్ళని చూస్తుంటే చూడముచ్చ టేస్తుంది ఆ పాపకి.

అలవాటైన చెట్టు దగ్గరకి తడబడే అడుగుల్తో చేరిం దా పాప. అప్పటికే ఆ పాప తల్లి పాచిపని చేసే ఇంటి వాళ్ళ అమ్మాయి సుస్మిత రుసరుసలాడుతూ ఎదురు చూస్తోంది.

"ఎన్నిసార్లు చెప్పాలి నీకు త్వరగా కేరియర్ తీసుకురమ్మని? చూడు అప్పుడే నా ఫ్రెం డ్సందరూ భోజనం చేసేస్తున్నారు. ఇలా అయితే రేపటి నుంచి నిన్ను మానిపించేయమని చెప్తాను అమ్మతో." విసురుగా ఆ పాప చేతిలో నుంచి కేరియర్, వాటర్ బేగ్ లాక్కుంటూ ధుమ ధుమ లాడిపోయింది ఆరవ తరగతి చదువుతున్న సుస్మిత.

*** *** ***

అరగంట తరువాత-

కడుపు నిండిన పిల్ల లంతా తృప్తిగా, హుషారుగా మధ్యాహ్నం క్లాసులకి తరగతి గదుల్లోకి అడుగుపెడ్తుంటే, చీవాట్లతో కడుపునిండిన ఆ పాప ఆకలి కడుపుతో, ఖాళీ కేరియర్‌తో, సుస్మితకి ఉదయం అవసరం తీరిపోయిన పుస్తకాలతో భారంగా అడుగులు వేస్తూ స్కూలు గేటు దాటి బయటికి అడుగు పెట్టింది. ★

